ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 19 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం) సహర్: 4:59 (గురువారం ఉదయం)



డీలిమిటెన్షన్!

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై సర్వత్రా ఉత్కంఠ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12స్థానాలు
- కొత్తగా నాలుగైదు నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా
- పొరుగు జిల్లాల నుంచి 12 మండలాలు ఉమ్మడి జిల్లా పరిధిలోకి విలీనమయ్యే అవకాశం
- ఒకే జిల్లా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఉండేలా కసరత్తు
- వరంగల్ నగరంలో ఒకటి, చుట్టు పక్కల ప్రాంతాల్లో మరొకటి ఏర్పడే ఛాన్స్
- భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో మరో మూడు!
- రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం కసరత్తు చేస్తోంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉన్నట్టుగా అంచనా. దీంతో నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. వరంగల్ నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయని, కొత్త నియోజకవర్గాలు, రిజర్వేషన్ల మార్పుతో పాటు నియోజకవర్గాల హద్దులు కూడా మారే అవకాశం ఉందన్న సమాచారంతో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికలనాటికి ఓరుగల్లులోని అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కలు తేలనుండటంతో.. ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్ ఏంటా అన్న ఉత్కంఠలో ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ప్రతీ 20ఏళ్లకు ఒకసారి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. 2008లో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 13 అసెంబ్లీ స్థానాల సంఖ్య 12 స్థానాలకు పడిపోయింది. అలాగే శాయంపేట, చెన్నూరు, చేర్యాల, హనుమకొండ, వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల స్థానంలో కొత్తగా పాలకుర్తి, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, వరంగల్‌తూర్పు పేరుతో నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. శాయంపేట నియోజకవర్గం మొత్తానికే కనుమరుగైంది. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. అయితే రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో నియోజకవర్గాలను పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని ప్రతీ ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ స్థానాలను పెంచాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ లెక్కన తెలంగాణలో కొత్తగా 34 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. అంటే ప్రస్తుతం ఉన్న 119తో 34 కొత్తవాటిని కలిపితే 153 స్థానాలవుతాయి. ఈ నేపథ్యంలో 2011 జనాభా ప్రకారం రాష్ట్రంలో 3,51,93,978మంది జనాభా ఉండగా.. ఈ మొత్తాన్ని 153నియోజకవర్గాలతో భాగిస్తే.. ప్రతీ నియోజకవర్గంలో 2,30,064జనాభా ఉండాలి. అయితే పునర్విభజన చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో 10శాతం తక్కువ లేదా ఎక్కువ ఉండవచ్చు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలున్నాయి. ఈ లెక్కన నాలుగు అసెంబ్లీ స్థానాలు పెరుగాల్సి ఉంది. అయితే జనగామ నియోజకవర్గం భువనగిరి ఎంపీ స్థానంలో కలుస్తుండగా, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల పరిధిలోని కొన్ని మండలాలు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో విలీనమయ్యాయి. వీటన్నింటిని కూడా ఒకే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి తీసుకరానున్నారు. పార్లమెంట్ పరంగా చూస్తే నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే ఛాన్స్ ఉంది. ఇక జనాభా పరంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 39,17,048మంది జనాభా ఉంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2,30,064మంది ఉండాలి.. అంటే 17 స్థానాల వరకు పెరిగే అవకాశం ఉంది. ఇందులో ఒకటి అటు ఇటుగా మారే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పునర్విభజనతో కొత్తగా నాలుగైదు స్థానాలు పెరుగుతాయనే చర్చ జరుగుతోంది.

ఒకే జిల్లా పరిధిలో ఒక నియోజకవర్గం సాధ్యమేనా?

ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే జిల్లా పరిధిలో ఉండేలా అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది. అయితే ఆరు చిన్న జిల్లాలుగా ఉండటంతో అంతటా ఇది సాధ్యపడకపోవచ్చుననే అభిప్రాయాలున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న హనుమకొండ పరిధిలో ఎక్కువ అసెంబ్లీ స్థానాలు వచ్చే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లాలో 11,35,707 జనాభా ఉండగా, వరంగల్ జిల్లాలో 7,16,457 జనాభా ఉంది. అలాగే జనగామ జిల్లాలో 5,82,457 మంది జనాభా, మహబూబాబాద్ జిల్లాలో 7,70,170 మంది, భూపాలపల్లిలో 4,16,763 మంది, ములుగు జిల్లాలో 2,95,494జనాభా మాత్రమే ఉంది. అయితే వరంగల్ నగరం హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో ఉండటంతో పాటు గ్రేటర్ వరంగల్ జనాభా

మిగతా 7వ పేజీలో..


2011లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో జనాభా.. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలు.. కొత్తగా ఏర్పడేందుకు అవకాశం ఉన్న స్థానాల వివరాలు

జిల్లా	జనాభా (2011లెక్కలు)	ప్రస్తుత నియోజక వర్గాలు	కొత్తగా (అంచనా)	మొత్తం
వరంగల్	7,16,457	03	01	04
హనుమకొండ	11,35,707	02	02	04
జనగామ	5,82,457	03	01	02
మహబూబాబాద్	7,70,170	02	01	03
భూపాలపల్లి	4,16,763	01	01	02
ములుగు	2,95,494	01	01	02
మొత్తం	39,17,048	12	06	17

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- పటిష్ఠ చర్యలు చేపట్టిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 20 సెంటర్ల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 3449 మంది విద్యార్థులు
- 20 మంది సిట్టింగ్ స్క్వాడ్లు.. 230 మంది ఇన్విజిలెటర్లు

భూపాలపల్లిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని డీఈవో ఎం.రాజేందర్ తెలిపారు. వీటిలో బీ సెంటర్లు 17 కాగా మూడు సీ సెంటర్లు ఉన్నాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 3,449 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వీరితో పాటు 395 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలను పటిష్ఠ నిఘా నడుమ పకడ్బందీగా నిర్వహించనున్నామని డీఈవో చెప్పారు. సీసీ కెమెరాలతో పాటు పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్‌తో పాటు విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.



20 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు..

పదో తరగతి పరీక్షలు ఈ నెల 21న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగియనున్నాయి. వీటిని సజావుగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 20 కేంద్రాల్లో ఒకటి చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 230 మంది ఇన్విజిలెటర్లు, 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ముగ్గురు సీ సెంటర్ కస్టోడియన్స్, రెండు రూట్లలో ఇద్దరు రూట్ అధికారులు పర్యవేక్షించనున్నారు. అలాగే రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ల పర్యవేక్షణ ఉండనుంది. ఈ పరీక్షలకు 3,449 మంది విద్యార్థులు జనరల్ పరీక్షలు రాయనుండగా 395 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 1725 మంది బాలురు, 1724 మంది బాలికలు ఉన్నారు. 15 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలు 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు సమయపాలన పాటించాలని డీఈవో సూచించారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని, ఆలస్యమైతే అనుమతి ఉండదని హెచ్చరించారు.

3 సీ సెంటర్లు.. ముగ్గురు కస్టోడియన్స్

జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 3 సీ సెంటర్లు (పోలీస్‌స్టేషన్ సమీపంలో లేనివి) ఉన్నట్లు డీఈవో తెలిపారు. అందులో మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి, గణపురం మండలం చెల్పూరు, మల్హర్ మండలం తాడిచర్ల ఉన్నాయి. మిగతా 17 సెంటర్లు పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉన్నాయని డీఈవో తెలిపారు. 121 పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా 12 జోన్లుగా విభజించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మృతి



అజయ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం తండా ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాం పూర్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజయ్‌కు మార్ (24) వ్యక్తిగత పని నిమిత్తం భూపాల పల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అజయ్ కుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. మృతుడు తన తండ్రితో కలిసి వ్యవసాయ పనులు చేసేవాడని పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసులో పదిన్నరేళ్ల జైలు

మహాముత్తారం, మార్చి18(ఆంధ్రజ్యోతి): వివాహితపై లైంగిక దాడి కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల ఆరు నెలల జైలు శిక్షను విధిస్తూ భూపాలపల్లి ప్రిన్సిపల్ సేషన్ కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం తీర్పు చెప్పారు. మహాముత్తారం ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మహాముత్తారం మండలం మహబూబ్‌పల్లికి చెందిన 30 ఏళ్ల ఏర్నేని నరేష్ 2015 జనవరి19న ఓ వివాహిత మహిళపై లైంగిక దాడి చేశాడు. దీంతో అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు అతడిపై కేసు నమోదు చేశారు. దీనిపై కాటారం సీఐగా ఉన్న మహేష్ దర్యాప్తు చేట్టారు. సాక్ష్యాధారాలను కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి మంగళవారం తీర్పును వెలురించారు. దోషిగా తేలిన నరేష్‌కు పదిన్నరేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 1500 జరిమానా విధించారు. కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డిని ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

పురుగుల మందు తాగి మిర్చి రైతు ఆత్మహత్య



సతీష్ (ఫైల్)

వెంకటాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన మిర్చి రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామంలోని రామెళ్ల సతీష్(39)మూడెకరాల్లో మిర్చిపంటను సాగు చేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో కూలీలు దొరకకపోవడంతో పంట నేలరాలి నష్టపోతోందని మనస్తాపానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో గత 15 రోజులుగా మద్యం సేవించి తిరుగుతున్నాడు. సోమవారం ఉదయం మిర్చితోట వద్దకు వెళ్లిన సతీష్ మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే సతీష్ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

సాగునీటికి నిధులు ఇవ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉండి పంటలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన పలు అంశాలపై ఆయన మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని డీబీఎం -38 కాల్వ సుమారు 82 కిలోమీటర్ల పొడవున ఉందని, దాని ఆయకట్టు 44,470 ఎకరాలు ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎన్నోసార్లు రిపేర్లు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.220 కోట్లు వెచ్చించి పనులు చేపట్టినట్లు రికార్డులు చెబుతున్నా ఈ ప్రాంతానికి చుక్క నీరు రావడం లేదన్నారు. అలాగే రూ. 34లక్షలతో చెట్లు, మట్టి తొలగించినా, 5వేల కూసెక్కులకు బదులు 6వేల కూసెక్కుల నీరు వదిలినా 44,470 ఎకరాలు పండే పరిస్థితి లేదన్నారు. చిట్యాల, టేకుమట్ల, గోరికొత్తపల్లి, రేగొండ మండలాలకు ఫేజ్-2 దేవాదుల నుంచి చలివాగుకు వచ్చేటువంటి వాగు దగ్గర లింక్ కలిపేందుకు రూ.27కోట్లు ఖర్చు చేస్తే 44,470 ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుందన్నారు. గొల్లబుద్దారం సమీపంలోని భీంఘణపురం చెరువును దేవాదుల రిజర్వాయర్‌గా చేసినప్పటికీ 2,400 ఆయకట్టుకు సరిపోను నీరు అందడం లేదన్నారు. అలాగే దాని వెనుకాల 5 వేల ఎకరాలకు కరెంటు సౌకర్యం లేక పంటలు ఎండి పోతున్నాయని అన్నారు. కాగా ఈ ప్రాంత భూములు సస్యశ్యామలం కావడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నాపాక దేవాలయం, కోటగుళ్ల అభివృద్ధికి కూడా నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

కార్మిక హక్కులను పరిరక్షించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల హక్కుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాపల్లి జిల్లా కేంద్రంలోని కొమరయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో మహాసభలు ఆకుల శ్రీనివాస్ అధ్యక్షత మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు.. భూపాలపల్లి జిల్లా దినదినాభివృద్ధి చెందుతున్న క్రమంలో వివిధ రకాల కార్మికులు ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతున్నారని అన్నారు. వారందరినీ ఐక్యం చేసి వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని స్థానిక నాయకత్వానికి సూచించారు. కార్మిక అడ్డాల కోసం కలెక్టర్, తహసీల్దార్లతో మాట్లాడి ఏర్పాటు చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగవైకల్యమైతే రూ.5లక్షలు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు నెలనెలా రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కుడుదుల వెంకటేశ్, లావణ్య, నారాయణ, రాము, శ్రీనివాస్, రమేష్, రవి, వసంత, పద్మ, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి ప్రత్యేక నిధులు!

- రూ.50కోట్ల మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం
- శాశ్వత అభివృద్ధి పనులకు మరింత చేయూత
- మెరుగు పడనున్న భక్తుల సౌకర్యాలు

7లో..



వనదేవతల గద్దెల వ్యూ (ఫైల్)

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి

నిధులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దవంగర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ప్రాజెక్టుల పనులపై పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లి సమస్యల పరిష్కారం కోసం నిధులను మంజూరు చేయాలని మంత్రి వర్గాన్ని కోరారు. 2016లో నూతనంగా ఏర్పాడిన నాటి నుంచి మౌలిక వసతుల కొరత ఉందని, మండలాభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి సీడీపీ నిధుల ద్వారా రూ.1కోటి మంజూరు చేసినా పనులు పూర్తి స్థాయిలో కాలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని, మండల పరిషత్, వ్యవసాయ కార్యాలయంతో పాటు ఐకేపీ కార్యాలయాల నిర్మాణం చేపట్టలేదని, వాటి నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అద్దె భవనాల్లో కార్యాలయాలు ఉండడంతో అధికారులు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తావించారు. పెద్దవంగర మండలాభివృద్ధిపై అసెంబ్లీలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రస్తావించడంతో మండల ప్రజలు, అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. మండలాభివృద్ధి కోసం ఎమ్మెల్యే అసెంబ్లీలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకులంగా స్పందించడంతో పలువురు రాజకీయ నాయకులు, మండల ప్రజలు అధికారులు ఎమ్మెల్యే పని తీరును ప్రశంసిస్తున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకుడు



పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న మతిన్ మహ్మద్

వెంకటాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌ను ఎస్సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు మతిన్ మహ్మద్ మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక పరీక్షలు ఏవిధంగా రాయాలి.. మంచి మార్కులు ఎలా సాధించాలనే అంశాలపై టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబడుతూ విద్యార్థులకు పరీక్షల భయాన్ని తొలగించేలా మార్గనిర్దేశం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలన్నారు. ఆకర్షణీయమైన వాతావరణాన్ని కల్పించి విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, హెచ్‌ఎం రాధిక, ఉపాధ్యాయులు జనగాం బాబూరావు, రవీందర్, షేక్‌హసీనారాణి తదితరులు ఉన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

వెంకటాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రాం తంలో న్యాయ కళాశాల ఏర్పాటుతో ఆదివాసీ యువతకు న్యాయం జరుగుతుందని, ఈవిషయంపై సీఎంకు లేఖ రాయనున్నట్లు పేర్కొన్నారు. న్యాయ కళాశాల సాధించే వరకు ఆదివాసీలు పోరాడాలని పిలుపునిచ్చారు.



ఆగుతూ.. సాగుతూ..

- కొందరు రైతుల ఖాతాల్లోనే బోనస్ జమ
- మానుకోట జిల్లాలో ఇంకా 9,177 మందికి అందని వైనం
- ఎదురు చూస్తున్న అన్నదాతలు

తాళ్లపూసపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రైతన్నలకు బాసటగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచి, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినప్పటికీ.. అవి సకాలంలో వారికి దరి చేరడం లేదు. సన్న ధాన్యానికి క్వింటాన్‌పై రూ.500 బోనస్ ప్రకటించినా.. అవి ఆగుతూ, సాగుతూ అడపాదడపా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. బోనస్ ఎప్పుడు వస్తుందోనని వారు కొనుగోలుదారుల చుట్టూ, జిల్లా పౌరసరఫరాల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 30, 870 మంది రైతులకు వడ్ల బోనస్ ఇవ్వాల్సి ఉంది. మంగళవారం నాటికి 21, 693 మంది రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం బోనస్ నిధులు జమ అయ్యాయి. ఇంకా 9, 177 మంది రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు.

మానుకోట జిల్లాలో 1,36,112 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. వరికి రూ.2,320 ఏ గ్రేడ్ ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించింది. సన్న వడ్లకు క్వింటాన్‌పై రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో రైతులు బోనస్ కోసం సన్న వెరైటీలనే ఎంచుకుని సాగు చేశారు.అధిక దిగుబడీ వచ్చింది. జిల్లాలో సివిల్ సప్లై అధికారులు

సన్న రకాలకే రైతులు ప్రాధాన్యం

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనవరి చివరాంకంలో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. ఆనాటి వరకు 1,55,011 మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకాల వడ్లను ఆయా కొనుగోలుదారులు ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేశారు. అందులో 1,43,305 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం 30,870 మంది రైతులు అమ్ముకున్నారు. 1,890 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొంతమంది రైతులు అమ్ముకున్నారు.

బోనస్ ఇలా..

మహబూబాబాద్ జిల్లాలో 30,870 మంది రైతులకుగాను రూ.500 ప్రకారం.. రూ.71.65 లక్షలు రైతులకు పంపిణీ చేయాల్సి ఉంది. ముందుగా కొంత మంది రైతులకు విడుదల చేసిన నిధులు అడపాదడపా రైతుల ఖాతాల్లో పడుతూ వచ్చాయి. గత జనవరి చివరి వారం, ఫిబ్రవరిలోనూ రైతులకు బోనస్ పడకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. ఫిబ్రవరి 28 తర్వాత కొద్ది మంది రైతులకు వారి ఖాతాల్లోకి బోనస్ డబ్బులు పడుతూ వస్తున్నాయి. మంగళవారం నాటికి 21,693 మంది రైతులకు రూ.49.60 కోట్లు రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. ఇంకా 9,177 మంది రైతుల ఖాతాల్లో రూ.22.04 కోట్లు రైతుల ఖాతాల్లో చెల్లించాల్సి ఉంది. మిగతా రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ముగిసిన అంగన్‌వాడీల 48 గంటల ధర్నా

- మానుకోటలో భారీ ర్యాలీ, కలెక్టరేట్‌లో వినతిపత్రం
- బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు అధిక నిధులు కేటాయించాలి
- సీఐటీయూ డిమాండ్



మానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మహబూబాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన 48 గంటల ధర్నా మంగళవారంతో ముగిసింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన చేపట్టికలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ మాట్లాడారు. శాసనసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్ రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం నెలకు రూ.18 వేలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, ఇతర బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా ఆరోగ్యలక్ష్మి, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, శ్రీశైలం, వీరన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెస్త సంపూర్ణ, దారా స్నేహబిందు, తిరుపతమ్మ, స్వరూప, నీలా, లలిత, ధనలక్ష్మి, మంగ, శైలజ, ఉమా, వీరలక్ష్మి, జ్యోతి, పద్మ, సమ్మక్క, భద్రకాళి, సంధ్య, సలీమా, మల్లికాంబ, సరిత, రజని, కవిత తదితరులు పాల్గొన్నారు.

కురవి సంత వేలం

రూ.46 లక్షలు

కురవి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కురవి పశువుల సంత, తాయిబజార్ వేలం పాటను మంగళవారం కురవి గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ వేలం పాటను కురవి స్పెషల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డి, డీఎల్‌పీవో కనకదుర్గ, ఎంపీవో గౌస్, గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి సమక్షంలో నిర్వహించారు. సంత వేలాన్ని సీల్డ్ టెండర్ ద్వార కురవికి చెందిన తరాల వీరన్న రూ.45,99,999లకు సంత వేలంను దక్కించుకున్నాడు. గత సంవత్సరం సంత వేలం రూ.42 లక్షల 55 వేలు ఉండగా ఈ సంవత్సరం గ్రామపంచాయతీకి మూడున్నర లక్షలు ఆదాయం లభించింది.



జీపీలో సంత వేలం నిర్వహిస్తున్న తహసీల్దార్ సునీల్‌రెడ్డి



యంత్రాలతో సాగుతున్న అభివృద్ధి పనులు

సరస్వతీ పుష్కరాల పనులు ప్రారంభం

మహదేవపూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రివేణి సంగమం వద్ద మేలో జరిగే సరస్వతీ పురష్కరాల పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేయగా టెండర్లు ఖరారై 25 రోజులు గడిచాయి. పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ 15 రోజులుగా ఉన్నతాధికారుల సమీక్షలతోనే సరిపోయింది. తాజాగా మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కలెక్టర్ రాహుల్ శర్మ చొరవతో పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, కాళేశ్వరా లయ ఈవో మహేష్ పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు, ఎస్సై తమాషారెడ్డితో పాటు పంచాయతీరాజ్ డీఈలు, ఈఈలు ఉన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

అంగన్‌వాడీల జీతాలు పెంచాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అంగన్‌వాడీల జీతాలు పెంచాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రెండోరోజు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం అందించాలని, పెండింగ్ టీఏ, డీఏలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అంగన్‌వాడీలు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కూరెందుల సమ్మక్క, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గఫూర్ పాషా, నాయులు సద్దాం హుస్సేన్, తోకల రవి, బాలేశ్వర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు పద్మారాణి, జమునారాణి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, వనమాల, పార్వతి, లక్ష్మీనర్సమ్మ, సుశాంతల, వెంకటరమణ, రత్నకుమారి, విజయలక్ష్మి, ఈశ్వరి, రుక్మిణి, నిర్మల, సుమలత, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గార్లలో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

ఇబ్బందులు పడిన ప్రయాణికులు



గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని నిలిచిపోయిన ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు

గార్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రం సమీపంలోని ఐబీ సిగ్నల్ వద్ద మంగళవారం రెండుగంటల పాటు ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలును సం బంధిత అధికారులు నిలిపి వేశారు. గార్ల-గుండ్రాతి మడుగు మధ్యలో ఉదయం సాంకేతిక లోపంతో గూడ్స్‌రైలు నిలిచి పోయింది. ఈ సమయంలో విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వెళ్లాల్సిన 20805 నెంబర్ గల ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను గార్లలో ఎగువ లైనుపై ఉదయం 6గంటల ప్రాంతంలో నిలిపివేసి, 8 గంటలకు పంపించారు. దీంతో 2గంటల పాటు రైలులోనే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అంతరాయం

డోర్నకల్, (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య సెక్షన్‌లోని గుండ్రాతిమడుగు స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు ఇంజన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో గుండ్రాతిమడుగు సమీపంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్, గార్లస్టేషన్ సమీపంలో ఏపీ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో కాకతీయ ఎక్స్‌ప్రెస్, హోం సిగ్నల్ వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. అలాగే భద్రాచలం రోడ్ టు సిరిపూర్‌కాగజ్‌నగర్ వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను రెండు గంటల పాటు పోచారం స్టేషన్‌లో నిలిపివేశారు. మహబూబాబాద్ నుంచి మరో ఇంజన్‌ను తీసుకువచ్చి గూడ్స్ రైలును గుండ్రాతిమడుగు స్టేషన్‌కు చేర్చిన తర్వాత రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

రైతులు ఎస్సారెస్పీ నీటిని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎస్సారెస్పీ నీటిని వినియోగించుకోవాలని తహసీల్దార్ వీరగంటి మహేందర్, మండల వ్యవసాయాధికారి గుగులోతు స్వామినాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎస్సారెస్పీ కెనల్ వద్ద నీటిని, పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలత్తకుండా పంటలకు సాగునీటిని అందిస్తామన్నారు. రైతుల సాగు నీటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ప్రతీ రైతు సాగుచేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వివిధ పంటలలో పురుగులు, తెగుళ్ల నివారణ నుంచి పంటలను కాపాడుకోవడానికి ఏ మోతాదుల్లో ఎరువులను వాడాలో తగిన సూచనలను రైతులకు వివరించారు. డిజిటల్ సర్వే పంటల నమోదు కార్యక్రమంను వేగవంతం చేయాలని, ప్రతీ రైతు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు అప్రమాత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రికితిన్ శాస్త్రి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్, ఏవో స్వామినాయక్

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2160	2100
పల్లికాయ (సూక)	7390	6500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
కందులు	6921	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6975	5800
దీపిక	15800	15245
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13650	9000
తేజ ఏసీ	16500	14000
వండర్‌హాట్	16000	11500
యూఎస్341	13100	9500
దేశీ	30000	25500
సింగిల్‌పట్టి	33000	28000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాల్సిందే..

తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

గోవిందరావుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేయాల్సిందేనని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతనే గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యనగందుల మొగిలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం నాటికి రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చింత కృష్ణ నిరస దీక్షలో నాయకులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అక్తర్ కమిషన్ రిపోర్టులో కొన్ని కులాలను తప్పుడు గ్రూపులో చేర్చడం మూలంగా షెడ్యూల్ కులాల్లోని చిన్న కులాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్ కులాల్లోని 59 కులాలకు వారివారి జనాభా నిష్పత్తి ప్రకారం సమానంగా వర్గీకరణ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఏప్రిల్‌లో జరిగే తుడుందెబ్బ బహిరంగసభకు మాదిగలు, దళితులు, ఆదివాసీలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈదీక్షలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నెమలి నర్సయ్య, ఇరుగు పైడి, ముస్లిం మైనారిటీ జమాత్ మండల నాయకులు మహమ్మద్ దాదాబాయి, మహ్మద్ షారుఖ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కల్లెపల్లి రమేష్, జన్ను సాంబయ్య, కేశపాక కార్తీక్, యాదగిరి, గుండె కొమురయ్య, నాగరాజు, జాన్, శంకర్, నరేష్, వివిధ సంఘాల నాయకులు దేవరకొండ ఏడుకొండలు, ముంజాల భిక్షపతి గౌడ్, లకావత్ నర్సింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

వారం పాటు ఎస్సారెస్పీ ద్వారా

సాగునీటి విడుదల

దంతాలపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా రైంతాగానికి మరో వారం పాటుకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు సంబంధిత డీఈ వినయ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ డీబీఎం 60తో పాటు ఉప కెనాల్స్‌కు కెనాల్ గండ్లు పెడితే క్రిమినల్ కేసులకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ ఫంక్షన్ శివారు వద్ద డీబీఎం 60 కెనాల్ ఉధృతిని ఎస్సారెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పరిశీలించి పర్యవేక్షణలో ఉంటారన్నారు. డీబీఎం 60 నుంచి వెళ్లే ఉప కెనాల్‌కు గండ్లు కాని మట్టి తోలకం జరిగితే కఠిన చర్యలు తప్పదన్నారు. రైతులకు యాసంగిలో నీటిని అందించేందుకు గాను మార్చి వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తామన్నారు. కెనాల్ గేట్లను ఎత్తివేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరిపెడ మండలంతో పాటు చివరి ఆయ కట్టు వరకు నీటి విడుదల చేస్తామన్నారు.









మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న మానుకోట, కురవి రహదారి , మధ్యాహ్నం జనసంచారం తక్కువగా ఉన్న వరంగల్ నగరంలోని రోడ్లు



← తొర్రూరులో ఎండ నుంచి ఉపశమనం పొందేలా తాటి కొమ్మలు నెత్తిన పెట్టుకుని బైక్‌పై వెళ్తున్న వాహనదారుడు, ముఖానికి రక్షణగా వస్త్రాలు కట్టుకున్న దృశ్యం

సుర్రుమంటోంది..

రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత

- 40 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- వేసవి ప్రణాళికకు సిద్ధమవుతున్న వైద్యఆరోగ్యశాఖ



పోచమ్మమైదాన్ /మహబూబాబాద్ టౌన్ /వర్ధన్నపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎండ సుర్రుమంటోంది. ఉదయం 9గంటల నుంచే భానుడు భగ్గుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో మాడు పగులుతోంది. దీంతో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడిజిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు చేరువయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం 39.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదవగా.. వరంగల్‌లో 38డిగ్రీలు, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో 37డిగ్రీలు, ములుగు, జనగామ జిల్లాలో 36డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. క్రమంగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు (48) వడదెబ్బతో మృతి చెందాడు. ఎండల వేడిమితో ఏసీల వాడకం, విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు కూలర్ల ద్వారా ఉపశమనం పొందుతున్నారు. అలాగే జనం శీతల పానియాలను(జ్యూస్) ఆశ్రయిస్తుండటంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తోంది. ముమ్ముందు ఎండలు మరింత తీవ్రమవుతాయన్న అంచనాల నేపథ్యంలో వాతావరణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. అలాగే జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా అప్రమత్తమవుతున్నారు. వడదెబ్బకు గురవకుడా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

వేసవి కాలంలో వడదెబ్బకు గురైన సమయంలో ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపురంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా అపస్మారక స్థితిలోకి వెళ్లే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కన్పిస్తాయి.

ప్రథమ చికిత్స..

వడ దెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఎండదెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి, సత్వర చర్యలకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స అనంతరం దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడడం చేయవద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు, నూలు వస్త్రాలు ధరించాలి. నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు అనారోగ్యంతో బాధ పడేవారు తరుచుగా మంచినీరు, ఓఆర్‌ఎస్ తాగాలి. ఒక వేళ నోరు ఎండుకపోవడం, దాహం వేయడం లక్షణాలు ఉంటే ఆశా కార్యకర్తను సంప్రదించాలి. ఉద యం 12 గంటల్లోపు.. సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు వెళ్లి పనులు చూసుకోవాలి.

అప్రమత్తమవుతున్న వైద్య, ఆరోగ్యశాఖ...

జిల్లాల్లో వేసవి ప్రణాళిక అమలు చేయడానికి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఏటా మార్చి నెల చివరికల్లా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమ్మర్ అలర్ట్ ప్రకటించి పలు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఆర్‌ఎల్, ఎన్‌ఎస్ ద్రవణాలను అందుబాటులో ఉంచాలి. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సైతం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమ్మర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలస్తోంది. పీహెచ్‌సీ నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు సైతం వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

గోవిందా.. గోవిందా..

వైభవంగా నరసింహుడి రథోత్సవం

- కొమ్మాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన క్యూ లైన్‌లు

గీసుగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాల లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించడానికి ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలతో తరలి వచ్చారు. దీంతో ఆలయప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచియున్నారు. సాధారణ దర్శనానికి గంటలు సమయం పట్టింది. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల క్యూ లైన్‌లు కూడా భక్తులు గంటకు పైగా వేచి ఉండి దర్శించుకున్నారు. మంగళవారం ఒక్కరోజే 20 వేల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్, ఎస్‌ఐలు కుమార్, ప్రశాంత్‌బాబు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వామివారిని 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మార్మోగిన గోవిందా.. నామస్మరణలు



రథంలో ఆసీనులైన ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టం ఉత్సవమూర్తుల రథోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. 25 ఫీట్లు ఎత్తులో ఉన్న రాతి చక్రరథంను రంగులు, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీలక్ష్మీనరసింహస్వామిని, భూదేవి, నీలాదేవిలను పట్టువస్త్రాలతో అందంగా ముస్తాబు చేసి రథంలో కూర్చొబెట్టి ఆలయగుట్ట చుట్టు ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తులు గోవిందా నామస్మరణలు మార్మోగాయి. దివ్యతేజోవంతమైన కల్యాణమూర్తులు ఆసీనులైన రథాన్ని ఆలయం గుట్ట చుట్టూ తిప్పేందుకు భక్తులు పోటీపడ్డారు. రథ ప్రదక్షణలో కోలాట బృందాలు, యక్షగానం ప్రత్యేక ఆకర్షణగా నాలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, ఫణీంద్ర, విష్ణు, ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఉగాది వరకు జాతర కొనసాగుతుందని జాతర నిర్వహకులు తెలిపారు.

దేవాదులతో సాగునీరందిస్తాం

- పదేళ్లలో కేసీఆర్ చేసిన నిర్లక్ష్యం వల్లే నీటి ఎద్దడి
- కమీషన్ల కోసం కొత్త ప్రాజెక్టులు తెచ్చారు
- ఎన్ని నిధులైనా వెచ్చించి దేవాదులను పూర్తిచేస్తాం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



దేవన్నపేట పంపు హౌజ్‌లో పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, చిత్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తదితరులు

హనుమకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా భూములకు దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరందించి సస్యశ్యామలం చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండలోని దేవన్నపేట పంప్ హౌస్ ఫేజ్ -3 మోటార్లను ఆన్ చేసేందుకు మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో దేవాదుల ప్రాజెక్టు వద్దకు వచ్చిన మంత్రులకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నీటి పారుదల శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పంప్ హౌస్ వద్దకు చేరుకున్న మంత్రులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్యాకేజీ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు 2014 వరకు జరిగాయని, ఆ తర్వాత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, రాష్ట్రంలో నీటి ఎద్దడికి కారణం కేసీఆరే కారణమన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ఫేజ్-3లో మోటార్లను ఆన్‌చేసేందుకు తాము వచ్చామన్నారు. కాగా మోటార్ల పనులు జరుగుతున్నందున ప్రస్తుతం మోటార్లు ఆన్‌చేయలేదని, అర్ధరాత్రి వరకు ఉండైనా పనులు పూర్తి కాగానే మోటార్లు ఆన్‌చేసి వెళ్తామన్నారు. దేవాదులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తామన్నారు. మోటార్లు ఆన్ చేస్తే సుమారు 65 నుంచి 70వేల ఎకరాల వరకు సాగు నీరు అందించవచ్చన్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి బుధవారం రావాల్సి ఉండగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున మంగళవారం పంప్‌హౌస్ మోటార్లు ప్రారంభించేందుకు వచ్చినట్టు అసెంబ్లీ బడ్జెట్ సమావేశం కంటే రైతుల పంటలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చామన్నారు. 18 నెలల్లో పెండింగ్‌లో ఉన్న దేవాదుల పనులను పూర్తి చేస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అసెంబ్లీని ఎదుర్కొనే దమ్ములేదని, అందుకే చర్చల సమయంలో, బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కమీషన్ల కోసం శిలాఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారని, పదేళ్లలో దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. బడ్జెట్ సమావేశాలకంటే రైతుల సమస్యలే ముఖ్యమని పంప్ హౌస్ పనులను పరిశీలించినట్టు తెలిపారు. నాటి ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే రైతులకు ఈ స్థితి వచ్చేది కాదన్నారు. 2004లో రూ.6వేల కోట్లతో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.13వేల కోట్లకు కేసీఆర్ ప్రభుత్వం పెంచారని తర్వాత రూ. 18 వేల కోట్లకు పెరిగిందని దీనికి కారణం కేసీఆరేనని విమర్శించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దేవాదుల పంప్ హౌస్ పనులు వేగవంతంగా పూర్తి చేసినట్టు దీంతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంతోపాటు పాలకుర్తి, జనగామ నియోజక వర్గాల్లోని రైతులకు సాగు నీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించకుండా నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతుల కోసం సమీక్ష సమావేశం నిర్వహించి అవసరమైన నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు పూర్తి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యతో ట్రయల్ రన్ ఆలస్యం

సాంకేతిక సమస్య కారణంగా హనుమకొండలోని దేవన్నపేట పంప్ హౌస్ ఫేజ్-3 ట్రయల్ రన్ ఆలస్యమైంది. దీంతో తాము రాత్రి ఎంత ఆలస్యమైనా ఉండి మోటార్లను ఆన్‌చేసి వెళ్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రియ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మరమ్మతు పనులను కొనసాగిస్తుండగా.. మరమ్మతులు మరో నాలుగు గంటల్లో వాటిని పూర్తి చేస్తామని సాయంత్రం వారు చెప్పడంతో పనులు పూర్తయ్యేవరకు నిట్ గెస్ట్ హౌస్‌లో ఉండి మోటార్లు ఆన్‌చేసి వేళ్తామని మంత్రులు తెలిపారు.

మంత్రుల పర్యటనలో ఆకస్మిక మార్పులు

దేవాదుల ప్యాకేజీ ఫేజ్ -3 పంప్ హౌస్ పనులు పూర్తి కాకుండానే మంత్రులు మోటార్ల ప్రారంభానికి రావడం గమనార్హం. పనులు పూర్తికాకపోవడంతో మోటార్లు ఆన్‌చేయకుండానే పూజలు నిర్వహించిన మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వాస్తవానికి బుధవారం మోటార్లు ఆన్ చేస్తామని ప్రకటించగా.. అసెంబ్లీ సమావేశాల కారణంగా పర్యటనలో ఆకస్మికంగా మార్పులు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమ షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే హడావుడిగా మంత్రుల పర్యటన ఖరారవడంతో అధికారులు, పోలీసు సిబ్బంది కొంత ఇబ్బంది పడ్డారు.

మేడారానికి ప్రత్యేక నిధులు!

- రూ.50కోట్ల మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం
- శాశ్వత అభివృద్ధి పనులకు మరింత చేయూత
- మెరుగు పడనున్న భక్తుల సౌకర్యాలు



మహాజాతర సమయంలో మేడారం వ్యూ

తాడ్వాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ఆలయాల జాబితాలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల దేవస్థానం కూడా ఉండగా.. సుమారు రూ.50 కోట్లు మంజూరుకు సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నిధులతో వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడాని వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ప్రతీ రెండేళ్ల కోసారి జరిగే మహా జాతర, మరుసటి సంవత్సరం జరిగే మినీ జాతరలకు వివిధ రాష్ట్రల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలొస్తుంటారు. జాతరల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లలో ఖర్చు చేసి మౌలికసదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో ఇవ్వబోతున్న రూ.50కోట్ల ప్రత్యేక నిధులతో ఇప్పటికే ప్రతిపాదించిన శాశ్వత పనులకు మరింత చేయూత దక్కనున్నట్టు తెలుస్తోంది. పక్క ప్రణాళికలతో రోడ్ల విస్తరణ, దేవస్థానం విస్తరణ, అతిథి గృహాల ఏర్పాటు, క్యూలైన్లలో కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, తాగునీరు, విశ్రాంతి గదులు వంటి ఏర్పాట్లకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ట్రాఫిక్ జామ్ లేకుండా రోడ్ల విస్తరణ

మేడారం మహాజాతరకు లక్షల సంఖ్యలో తరలివచ్చే వాహనాలను ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు మూడు కిలో మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. జంపన్న వాగుకు ముందుగానే ఊరట్టం క్రాస్ వద్ద వాహనాలు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు తరలించి కాలినడకన భక్తులు గద్దెలకు చేరుకుంటారు. కాగా జంపన్నవాగు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు మినీ జాతర సమయంలో పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అటవి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖా తెలిపారు. మేడారం వచ్చే భక్తులకు దేవస్థానం సమీపంలో వాహనం వచ్చేలా అధికారులు ప్రణాళికలతో పనులు చేపట్టనున్నారు.

గద్దెల విస్తరణ

మేడారం మహాజాతరకు కోటికి పైగా తరలివచ్చే భక్తులు గద్దెల పరిసరాల్లో రద్దీ అధికంగా ఉంటుందని గద్దెల విస్తరణ చేపట్టాలని గతంలో పలుసార్లు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాగా జాతర సమయంలో పనులు సాధ్యం కాకపోవడంతో పనులు వాయిదాపడుతూ వచ్చాయి. 2026 మహాజాతర లోగా శాస్వత ప్రతిపాదికన పనులు చేపట్టి జాతర నిర్వహణ పనులతో చేపట్టాలనే ప్రభుత్వ లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో 19.20ఎకరాల భూమిని సేకరించి దేవస్థానం విస్తరణ పనులు చేపట్టనున్నట్లు సమాచారం. అదేవిధంగా విఐపీలు, వివిఐపీలు, ప్రోటోకాల్ దర్శనాలు, ప్రత్యేక అతిథులకు వసతి, విశ్రాంతి సౌకర్యాల కోసం అతిథి భవనాలు ఏర్పాటు చేయడం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే పనులు చేపట్టనున్నారు.

క్యూ లైన్లలో మౌలిక సదుపాయాలు

మహాజాతర సమయంలో రూ.కోట్లలో తరలివచ్చే భక్తులు రెండు ధర్మదర్శనాల క్యూలైన్ల నుంచి గద్దెలకు చేరుకుంటారు. ఒకటిన్నర కిలో మీటర్లకు పైగా ఉన్న క్యూలైన్ల ద్వారా గంటల సమయంలో భక్తులు ఎత్తు బంగారం మోస్తూ భక్తి శ్రద్ధలతో సమ్మక్క సారలమ్మల గద్దెలకు చేరుకుంటారు. అయితే క్యూ లైన్ల పై షెడ్ల నిర్మాణం చేపట్టి సీలింగ్ ఫ్యాన్‌లు, త్రాగునీరు వసతులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాట్లతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. జాతర సంమయంలో విఐపి, వివిఐపి, ప్రొటోకాల్, అతిథుల దర్శనాలతో సాదరణ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం.

పూజారుల హర్షం

మేడారం దేవస్థాన అభివృద్ధికి రూ.50కోట్ల ప్రత్యేక నిధులు మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం పట్ల వనదేవతల పూజారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముమ్ముందు జాతీయ హోదా వస్తే మేడారంలో సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ప్రచారం జరుగుతుందని సమ్మక్క సారలమ్మల జాతరకు మరింత పేరు ప్రఖ్యాతలు దక్కాలని ఆకాంక్షించారు. దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి ఉంటుందని అన్నారు.

డీలిమి'టెన్షన్'!

(5వ పేజీ తరువాయి)

పది లక్షకు పైగా ఉంది. ఈ లెక్కన చుట్టు పక్కల మండలాలను కలుపుకుని నాలుగు నియోజకవర్గాలు ఇక్కడే ఏర్పడే అవకాశం ఉంది. అంటే వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమతో పాటు వరంగల్ సెంట్రల్ నియోజకవర్గం ఏర్పాటు చేసే ఛాన్స్ ఉందనే చర్చ ఉంది. అలాగే హసన్‌పర్తి కేంద్రంగా హసన్‌పర్తి, కమలాపూర్, ఎలుకతుర్తి, భీందేవరపల్లి, ధర్మసాగర్, వేలేరు మండలాలతో కలిపి మరో కొత్త నియోజకవర్గం ఏర్పడేందుకు అవకాశం ఉంది. అలాగే ఈ నాలుగుతో పాటు పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలు వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోకి రానున్నాయి. మొత్తం ఏడు నియోజకవర్గాలు ఈ రెండు జిల్లాల పరిధిలో ఏర్పడే అవకాశం ఉంది. ఇక మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలుండగా.. ఇక్కడ తొర్రూరు లేదా కేసముద్రం కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పడవచ్చునని అంచనాలున్నాయి. కాదంటే మహబూబాబాద్ రూరల్ పేరుతో నియోజకవర్గ కేంద్రం ఏర్పాటుకు ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఏటూరునాగారం కేంద్రంగా కొత్తగా మరో నియోజకవర్గం ఏర్పాటు కానుందనే ప్రచారం జరుగుతోంది. అలాంటప్పుడు ములుగు నియోజకవర్గం పరిధిలో ఏయే మండలాలను చేర్చుతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని కొన్ని మండలాలను ములుగులో కలపొచ్చనే చర్చ ఉండగా.. భూపాలపల్లి జిల్లా కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో లక్ష యాభై వేల జనాభా ఉంది. చుట్టు పక్కల ఉన్న మరో ఒకటిరెండు మండలాలను కలిపి కాళేశ్వరం కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటుకు అవకాశం ఉందని సమాచారం. మొత్తంగా నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరగటం ఖాయంగా కనిపిస్తుండగా.. ఇప్పుడున్నట్లుగానే మండలాలు ఉంటే.. ఒకే జిల్లా పరిధిలో ఒక నియోజకవర్గం ఉండటం మాత్రం సాధ్యం కాకపోవచ్చునని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలో 4,16,763 మంది జనాభా ఉంది. ఒక నియోజకవర్గానికి కావాల్సిన జనాభాకంటే 1,86,699మంది జనాభా ఎక్కువగా ఉంది. అంటే మరో జిల్లాలోని నియోజకవర్గంలో ఈ జనాభాను కలపటం లేదంటే.. పొరుగు జిల్లాలోని ఒకటిరెండు మండలాలను కలిపి రెండో నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒకే జిల్లాలో ఒకే నియోజకవర్గం ఏర్పాటు చేయటం సాధ్యం కాదని, నియోజకవర్గాల ఆధారంగా జిల్లా సరిహద్దుల్లో మార్పు చేయాల్సి వస్తుందనే చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్లలోనూ మార్పులకు ఛాన్స్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, వీటిలో ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ ఎస్టీ రిజర్వుడు కాగా, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట ఎస్సీ రిజర్వుడు స్థానాలు. మిగతా ఏడు జనరల్‌గా కొనసాగుతున్నాయి. అయితే కొత్తగా నాలుగైదు స్థానాలు పెరుగుతుండటంతో మరొక రిజర్వుడు స్థానం పెరిగే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న రిజర్వుడు స్థానాల్లో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. అలాగే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కూడా 2028 నుంచి అమలు చేస్తే ఐదారు స్థానాలు మహిళలకు రిజర్వుడు కానున్నాయి.

ఆశావహుల్లో.. అ'టెన్షన్'..

కొత్తగా అసెంబ్లీ స్థానాలు పెరుగుతుండటం, రిజర్వేషన్ల మార్పులు జరుగుతాయనే ప్రచారంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రధానంగా మహిళ రిజర్వేషన్లు అమలు చేస్తే తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని టెన్షన్‌లో కొందరు తాజా, మాజీ ఎమ్మెల్యేలున్నారు. ఇప్పటికే ఓ మాజీ తనతో పాటు తన సతీమణి కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని సన్నిహితుల వద్ద చెప్పుకొంటున్నారు. అలాగే తనకు కాకుంటే తన సతీమణిని బరిలో దించుతానని ఓ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఇప్పటికే క్యాడర్‌కు సంకేతాలు పంపిస్తున్నారట. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు ఇప్పటికే తన వారసులను తెరపైకి తీసుకొస్తున్నారు. వీరితో పాటు రాజకీయాల్లో అడుగు పెట్టి ఒక్క ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్న నేతలు కూడా డిలిమిటేషన్‌పై ఆసక్తితో ఉన్నారు. అలాగే రాజకీయాలపై ఆసక్తి ఉన్న పలువురు ఇప్పుడిప్పుడే తమతమ కార్యాచరణను రూపొందించుకుంటూ.. పునర్విభజన జరగనున్న తీరును నిశితంగా గమనిస్తూ.. తమ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నట్టు సమాచారం. 2026లో ఈ డిలిమిటేషన్‌ను ప్రారంభించి, 2028లోపు పూర్తి చేయనున్నారు. దీంతో నియోజకవర్గాల పునర్విభజన ఎవరికి కలిసి వస్తుందో.. ఎవరికి అవకాశాలను దూరం చేస్తుందో అనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా సాగుతోంది.

విస్తృతంగా పర్యటించిన కలెక్టర్



ముల్లేకట్టలో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలెక్టర్ టి.ఎస్. దివాకర మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించి భోజనశాల, వంటగదిని, సరుకుల స్టోరేజీ గదిని పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నూతన విద్యా బోధనను పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆర్‌ఐటీఐ కళాశాలలో అగ్నిపథ్ 2025-26 సంవత్సరంలో భారత సైన్యంతో చేయడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. యువత తమలోని ప్రతిభ కనబరిస్తే మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో సైతం ఉద్యోగాలు పొందే అవకాశాలు వస్తాయని, యువత ఏదో ఒక రంగంలో విద్యను అభ్యసించడానికి చొరవ చూపాలన్నారు.

రామన్నగూడెం-రాంనగర్‌లోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లను క్రమం తప్పకుండా పరిశీలించాలని, ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏటూరునాగారం మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జగన్‌మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ మోవీన్ కుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పురోగతి సాధించాలని కలెక్టర్ దివాకర అన్నారు. మండలంలోని ముల్లకట్ట, రామన్నగూడెంలో ఆయన పర్యటించారు. ముల్లకట్టలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పనుల పురోగతిపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు ఆ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులు పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తి చేసుకుని ఆ పనులకు సంబంధించిన బిల్లులు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, గ్రామస్థులెవరూ అపోహలు నమ్మకుండా పనులు చేసుకోవాలని సూచించారు.

సింగరేణి యువ కార్మికుడి మృతి



వెంకటేశ్ (ఫైల్)

గణపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురై సింగరేణి యువ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్టు 8 ఇన్‌క్లైన్ వద్ద చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లిలోని యాదవనగర్‌కు చెందిన నూనె వెంకటేశ్ (32) జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2గంటలకు అండర్ గ్రౌండ్‌లో 3వ సీమ్ 21లెవెల్ వద్ద పంప్ ఆపరేటర్‌గా పనులు చేశాడు. విధులు ముగించుకుని రాత్రి 10.30 గంటలకు పైకి వచ్చి ఔట్ సంతకం చేశాడు. తోటి కార్మికుడు మహేష్ బైక్‌పై వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో వెంకటేశ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు 108వాహనంలో సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో వెంకటేశ్ మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక ఉంది.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వెంకటాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక ఫలితాల్లో నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడీవో క్షేత్రయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చిరుతపల్లి-2 బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలోని పలు రికార్డులు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లయితే ఏఎన్ ఎంకు తెలియజేయాలని సూచించారు. పాఠశాలలో విద్యుత్, నీటి సమస్య ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం నాగరాజు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీఆర్డీవో

కాటారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో నరేష్ మంగళవారం సందర్శించారు. విద్యాలయాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామితో కలిసి విద్యాలయంలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకుల విద్యాలయాన్ని తహసీల్దార్ నాగరాజు సందర్శించారు. ఆయన వెంట బీసీ గురుకుల ప్రిన్సిపాల్ గట్టయ్య, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శివలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కాటారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రాజీవ్ యువ వికాసం' పేరిట పథకాన్ని అమలు చేయనుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, దుర్గం రాజబాబు, చీమల వెంకటస్వామి, మాధవరెడ్డి, నీలాల సమ్మయ్య, ఇనుగాల లింగయ్య, చిట్యాల చందు, సాగర్, వేణు, రాజు, సుధాకర్, మల్లయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం యువతకు బాసటగా నిలుస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఈ పథకాన్ని రూ.6000కోట్లతో అమలు చేయడం సంతోషకరమన్నారు.

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం సానుకూలం



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, శంకర్‌రావు

వాజేడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టు మోడికుంట నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో ఆయన, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాజెక్టులు, వాజేడులో మోడికుంట ప్రాజెక్టుపై సీఎంకు వినతి పత్రం అందించారు. మోడికుంట ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు ఇప్పటికే తొలగిపోయాయని, నిర్మాణ సంస్థ సైతం కాంట్రాక్టు ఒప్పందం నుంచి తప్పుకుంటుందని ప్రకటించిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణానికి సంబంధించి టెంటర్లను పిలవాలని ఆయన కోరినట్లు, ఈ అంశంపై సీఎం స్పందించి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు శంకర్‌రావు చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన సమయంలో మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నట్లు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణపై లేఅవుట్ ఓనర్స్, లైసెన్స్ సర్వేయర్స్, డాక్యుమెంట్ రైటర్స్, సంబంధిత శాఖ అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశమయ్యారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా చెల్లించే ఫీజులో ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పించిందని తెలిపారు. ఒక లేఅవుట్‌లో 10శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యుంటే మిగిలిన 90శాతం ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించాలన్నారు. ప్రజలు నాలుగేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూస్తున్నారని, వారి కోసమే ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలులో పలు వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాల్లో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సబ్‌రిజిస్ట్రార్ రాము, మునిసిపాల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎంఎస్ నాయకుల ఆందోళన

కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద బీఎంఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఈపీఎస్ 95 కనీస పెన్షన్‌ను వెంటనే రూ.5వేలకు ఉంచాలన్నారు. ఈపీఎఫ్ జీత పరిమితిని రూ.15వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని, జీతం పరిమితిని రూ.21 వేల నుంచి రూ.42 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్థుల విక్రయాలపై తక్షణమే నిషేధించాలని, బీమా ఆర్థిక రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులను నిలిపివేయాలని అన్నారు. అసంఘటిత రంగానికి తగినన్ని నిధులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎం ఉపాధ్యక్షుడు వి.సుజేందర్, బ్రాంచి కార్యదర్శి రేణికుంట్ల మల్లేష్, కేంద్ర కమిటీ నాయకులు ఎం.రఘుపతిరెడ్డి, కత్తూరి మల్లేష్, ఎం.రాజు, భిక్షపతి, సురేష్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు దేశానికే ఆదర్శం : దామోదర్‌గౌడ్

భూపాలపల్లిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీల బిల్లు యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర సమన్వయకర్త తాళ్లపల్లి దామోదర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు తెచ్చి న్యాయం చేసిందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొక్కవోని దీక్షతో ఇందుకు కృషి చేశారని కొనియాడారు. బీసీల బిల్లు ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కృషి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే రాహుల్‌గాంధీ కులగణన చేయాలనే ప్రస్తావన తీసుకొచ్చారని తెలిపారు. ఈ క్రమంలోనే బీసీల బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు దామోదర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాటారం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరకుంట గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుర్గం గట్టుమల్లు అనే వ్యక్తికి చెందిన ఇల్లు కాలిపోయింది. ప్రమాదంలో శ్లాబ్ ఇంట్లోని పలు గృహోపకరణాలు, వంట సరుకులు, ఇతర వస్తువులు, బీరువాలో ఉన్న నగదు దగ్ధమయ్యాయి. గట్టుమల్లు కుటుంబం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిపోయారు. ఇంటి వద్ద గట్టుమల్లు కూతురు వందన ఉన్నారు. అదే వాడలో ఉన్న బంధువుల ఇంటికి వందన వెళ్లి వచ్చేసరికి మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడంతో ఆమె గమనించి కేకలు వేసింది. అప్పటికే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గదిలో మంటలు వ్యాపించి పలు వస్తువులు, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, గృహోపకరణాలు, నిత్యావసరాలు, బీరువా సహా అందులో ఉన్న రూ.40వేల నగదు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. గట్టుమల్లుకు ఫోన్ చేసి ప్రమాదం విషయం తెలపడంతో పొలం వద్ద నుంచి లబోదిబోమంటూ పరుగెత్తుకుని రాగా ఇంటి తలుపులు, లోపల వస్తువులు కాలిపోయాయి. గ్రామస్థుల సాయంతో విద్యుత్ సరఫరాను నిలిపేసి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతోంది.

దళారులను నమ్మి మోసపోవద్దు

- అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు
- 80 ఇళ్లకే ప్యాకేజీ వర్తిస్తుంది
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆర్డీవో వివరణ

కృష్ణకాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 భూసేకరణకు సంబంధించి ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని భూపాలపల్లి ఆర్డీవో నెవరుగొమ్ముల రవి తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు ఏమాత్రం వెనుకాడబోమని తేల్చి చెప్పారు. 'ఇల్లు కట్టు.. పరిహారం కొట్టు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో మంగళవారం ప్రచురితమైన వార్తా కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. భూసేకరణ విషయంలో ఎవరు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పరిహారం కోసం 380 ఇళ్లు కృత్రిమంగా నిర్మించారన్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని తెలిపారు. అయితే, ఇందులో 88 ఇళ్లకు మాత్రమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినా ఇందులో కూడా 8 ఇళ్లను సాంకేతిక కారణాల వల్ల తొలగిస్తున్నామని చెప్పారు. పరిహారం విషయంలో బాధితులు ఎవరూ దళారుల మాటను నమ్మి మోసపోవద్దని కోరారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని కోరారు. అలాగే, వ్యవసాయ భూముల పరిహారం విషయంలోనూ ఏమైనా సమస్యలుంటే పరిష్కరించి సరి చేస్తామని, రైతుల పట్ల తమకు సానుభూతి ఉందని అన్నారు. పూర్తి స్థాయిలో అన్ని నిర్ధారించుకున్న తర్వాతే పరిహారం పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలిపై ఫిర్యాదు

ములుగు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కపై సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు చింతల గీతారెడ్డిపై ములుగు పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మంత్రిని ఉద్దేశిస్తూ గీతారెడ్డి తన ఫేస్‌బుక్ ఖాతాలో అసభ్యపదజాలంతో కూడి పోస్టు పెట్టారు. దీనిని తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. బీఆర్ ఎస్ నాయకురాలిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీసీ సెల్ ములుగు మండల అధ్యక్షుడు పొడాల ఓంప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మాదారపు రాజు, నాయకులు ఓడ రాజు, ఓరుగంటి అనిల్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

తాడ్వాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపర్తి క్రాస్ సమీపంలో 163 జాతీయ రహదారిపై మంగళవారం వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బండారుపల్లి గ్రామానికి చెందిన పెండం వంశీ పస్రా నుంచి తాడ్వాయికి వెళ్తుండగా కొండపర్తి క్రాస్ వద్ద అటవీ ప్రాంతంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా ఏటూరునాగారానికి చెందిన దీపక్, శ్రీధర్‌రావు, ప్రవీణ్‌కుమార్, కిరణ్, భద్రు హనుమకొండకు వెళ్తున్న క్రమంలో వీరి కారు మొండ్యాల తోగు సమీపంలో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

'రామప్ప'ను సందర్శించిన అమెరికన్లు

వెంకటాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని అమెరికన్లు సామ్, నైట్ మంగళవారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించగా అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మలు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఆలయ తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసిన అమెరికన్లు కొబ్బరికాయలు కొట్టారు. ఆలయ శిల్ప కళా సౌందర్యాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

దేశ రక్షణలో యువత ముందుండాలి

వాజేడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో యువత ముందుండాలని ఆర్మీ అధికారులు గురదల్ సింగ్, ప్రేమ్ శర్మ అన్నారు. ఆర్మీలో చేరేందుకు మండల కేంద్రంలోని ఐటీఐ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మీలో చేరటానికి అవకాశాలు, దాని వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆర్మీలో ఉండటం వల్ల వచ్చే ఆర్థిక పరమైన అంశాలపై సైతం అవగాహన కల్పించారు. కేంద్రం ప్రభుత్వం అగ్నివీర్, అగ్నిపథ్ స్కీంలను తీసుకొచ్చిందని, వాటి ద్వారా యువత ఆర్మీలో చేరొచ్చని తెలిపారు. వచ్చే డిసెంబరులో హైదరాబాద్‌లో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొంటామని ఈ సందర్భంగా విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేఖర్, ఉపాధ్యాయులు యాదగిరి, సుజిత్‌సన్నీ, శ్రీనివాస్, రామ్‌ప్రసాద్, సత్యనారాయణ, వనజ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీని పరిశీలించిన డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల జగ్గన్నగూడెం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు పరిశీలించారు. పాఠశాల గదులు, ఆహార పదార్థాలు, వంటలను తనిఖీ చేశారు. ఎండాకాలంలో ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండనున్న దృష్ట్యా ఉదయం 11గంటల తర్వాత ఎండ ప్రాంతానికి వెళ్లకూడాని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వడదెబ్బ తగిలితే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలన్నారు.ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే వైద్యులు శ్రీలత, మల్లికార్జున్, ఆరోగ్య కార్యకర్తలు ఉపేంద్ర, తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

'యువ వికాసం'లో పారదర్శకత లోపించొద్దు

మంగపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి పోలెబోయిన ఆదినారాయణ కోరారు. మంగపేటలో ఆయన మంగళవార విలేకరులతో మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికీ ఉపాధి కల్పించాలని, రేషన్‌కార్డు ప్రామాణికాన్ని తొలగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధిని కల్పించే ఈ పథకంలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోవద్దన్నారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అంశాన్ని విస్తృత పర్చాలి : బీజేపీ

ములుగు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం.. ఒకే ఎన్నికల అంశాన్ని గ్రామస్థాయిలో విస్తృత పర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా కన్వీనర్ జినుకల కృష్ణాకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో బలరాం మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఒకే దేశం..ఒకే ఎన్నిక అనే విధానంతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే దేశం ఆర్థికంగా, అభివృద్ధిపరంగా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉంటుందని అన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, నాయకులు శీలమంతుల రవింద్రచారి, నరేష్, రామరాజు, సునీల్‌కుమార్, కారుపోతుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వసతి గృహాన్ని సందర్శించిన డీపీఎంవో

వెంకటాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహాన్ని మంగళవారం డీపీఎంవో సత్యనారాయణ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన వసతిగృహంలోని పరిసరాలను పరిశీలించడంతోపాటు బాత్‌రూంలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాన్ని, వంటలను పరిశీలించారు. అనంతరం ఆర్‌వో వాటర్ ప్లాంటును పరిశీలించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి

చిట్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌సీఈఆర్టీ పరిశీలకుడు రాంబాబు అన్నారు. మంగళవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మణ్‌తో కలిసి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఫార్మెటివ్ అసెస్‌మెంట్, సమ్మేటివ్ అసెస్ మెంట్, ఎల్‌ఈపీ, విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలించారు. ఎంఈవో రఘుపతి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోశాలు మరణం ప్రజా ఉద్యమానికి తీరనిలోటు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

గోవిందరావుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన నాయకుడు అంబాల పోశాలు అని, ఆయన మరణం ప్రజా ఉద్యమానికి తీరనిలోటని సీపీఎంపార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మంగళవారం పస్రాలోని ఆయన స్వగృహంలో పోశాలు గుండెపోటుతో మృతి చెందగా నాగయ్యతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డిలు అయన పార్థివదేహంపై ఎర్రగుడ్డ కప్పి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సంతాపసభలో నాగయ్య పాల్గొని మాట్లాడారు. అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడు పోశాలు అని, 1969 నుంచి నేటివరకు సీపీఎంలో క్రియాశీల కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారని అన్నారు. పేద ప్రజలకు భూమి, ఇంటిస్థలాలు, కూలీ రేట్లు పెంచాలని అనేక ఉద్యమాలు చేపట్టారని అన్నారు. కష్టజీవుల హక్కుల కోసం చివరిశ్వాస వరకు ఎర్రజెండా కోసం పరితపించారని అన్నారు. ఆయన చూపిన సమాజ లక్ష్యం కోసం, సోషలిస్టు సమాజం కోసం పాటుపడడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎంపార్టీ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, చిట్టిబాబు, దావూద్, గఫూర్, ఆగిరెడ్డి, రాజేష్, రాజేందర్, ప్రవీణ్, సూర్యనారాయణ, కృష్ణారావు, ఆదిరెడ్డి, రామస్వామి, సదానందం, కవిత, రాజేశ్వరి, ఉపేంద్రచారి, ఐలయ్య, రమేష్, రాజు, బ్రహ్మచారి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూర్ అడవిలో కార్చిచ్చు

మల్హర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ అడవిలో కార్చిచ్చు చెలరేగింది. దీంతో చెట్లు, మొక్కలు దగ్ధమయ్యాయి. కొయ్యూర్ నుంచి తాడిచర్లకు వచ్చే మార్గంలో మొదటి గుట్ట దిగే ప్రాంతంలో ప్రారంభమైన కార్చిచ్చుతో సుమారు రెండు కిలో మీటర్ల మేర అటవీ ప్రాంతమంతా వ్యాపించింది. దీంతో అక్కడంతా పొగతో నిండు కోవడంతో వాహన చోదుకులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో అటవీ ప్రాంతం కొంచెం దట్టంగా ఉంటుంది. కార్చిచ్చు వల్ల చిన్న, పెద్ద చెట్లు కాలిబూడిదవుతున్నాయి.